క్లుప్తంగా

గడువులోగా పనులు పూర్తి కావాలి



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్ శ్యామల

సాక్షి, భీమవరం: నిర్ణీత గడువులోగా భీమవరం పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కొత్త మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. విజయవాడ నుంచి బదిలీపై భీమవరం మున్సిపాలిటీకి వచ్చిన కమిషనర్ శ్యామల గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించి పట్టణాన్ని మరింత సుందరంగా తయారు చేయాలని ఆదేశించారు.

పట్టణాభివృద్ధికి కృషిచేయాలి

ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పట్టణాభివృద్ధికి పాటుపడాలని నూతనంగా నియమితులైన మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామలకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సూచించారు. విధుల్లో చేరిన అనంతరం ఆమె మోషేన్‌రాజును ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు



అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

వీరవాసరం: శ్రీ మావుళ్ళమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ ఆదాయం లెక్కింపు గురువారం రాయకుదురులోని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారని ఆలయ ఈఓ డి.వేణుగోపాల్ తెలిపారు. శ్రీ అమ్మవార్ల హుండీ ద్వారా రూ.1,22,405 ఆదాయం లభించిందన్నారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, చింతపల్లి ప్రసాద్, పోలిశెట్టి నాగులు, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

కాళ్ల పోలీస్ స్టేషన్‌కు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్‌ను బహూకరిస్తున్న కోనా కుటుంబ సభ్యులు

కాళ్ల: పోలీస్ స్టేషన్‌కు కంప్యూటర్‌ను బహూకరించడం అభినందనీయమని ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ అన్నారు. ఏలూరుపాడు గ్రామానికి చెందిన కోనా కుటుంబ సభ్యులు కాళ్ళ పోలీస్ స్టేషన్‌కు రూ.36,000 విలువ చేసే కంప్యూటర్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.మూర్తి, రాష్ట్ర బహుజన జేఏసీ అధ్యక్షుడు కోన జోసెఫ్, రవితేజ, రంజిత్, బుంగా ఆదాం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతపర్రులో రేషన్ కార్డుల పంపిణీ

పాలకొల్లు అర్బన్: నవరత్నాల ద్వారా పేదలందరికీ మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ అధికారం అప్పగిస్తే అదనపు సంక్షేమ ఫలాలు అందిస్తారని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామ సచివాలయంలో గురువారం కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రోడ్లను గ్రావెల్ రోడ్లుగా వేయడానికి మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 32 మందికి రేషన్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి షేక్ సులేమాన్, వీఆర్వో మండెల నరసింహారావు, వార్డు సభ్యులు చల్లా సాంబయ్య, శిర్రా రవి, మైలా మరియమ్మ, గుమ్మాపు అమ్మోజు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అత్తిలి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునే విధంగా చర్యలు చేపట్టాలని గృహనిర్మాణశాఖ ఈఈ వేణుగోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్దిదారులకు వివరించి, సత్వరమే ఇళ్లు నిర్మించుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

ముంపు సమస్యకు మోక్షం

ఆకివీడు శాంతినగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం



స్థానిక శాంతి నగర్‌లోని ప్రధాన రహదారి



ఆకివీడు శాంతినగర్‌లో నాడు అధ్వానంగా ఉన్న రోడ్లు

ఆకివీడు: ఆకివీడు పట్టణంలోని శాంతినగర్ కాలనీ ముంపు సమస్యకు మోక్షం దొరికింది. 25 ఏళ్ల క్రితమే స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో దుంపగడప వెళ్లే రహదారి వద్ద సిద్ధి వినాయక ఆలయం వెనుక కొంత మంది స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకున్నారు. పేరుకు శాంతి నగర్ అయినా ఎప్పుడూ సమస్యలే. పాలకులు పట్టించుకోకపోవడంతో రహదారులు అధ్వానంగా మారాయి. కనీసం డ్రెయినేజీ సౌకర్యం లేదు. చిన్న వర్షానికే కాలనీ మునిగిపోయేది. నడవడానికి వీలుఉండేది కాదు. వర్షాకాలం వస్తే జనం ఆందోళన చెందేవారు. లక్షలాది రూపాయలతో భవనాలు నిర్మించుకున్నా కాలనీ సమస్యలతో ఇబ్బంది పడేవారు. కాలనీలో సౌకర్యాలు కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు, సీపీఎం నాయకులు ఆందోళనలు చేశారు. అయినప్పటికీ వారి సమస్య ఒక కొలిక్కి రాలేదు. రోడ్డు వేసినా మునిగిపోతుండేంది. వీధుల్లో మురుగునీరు తిష్టవేసేది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన రూపురేఖలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత శాంతి నగర్ రూపురేఖలు మారిపోయాయి. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో కాలనీ వాసుల సమస్యలు గట్టెక్కాయి. స్థానిక నాయకులతో సంప్రదింపులు జరిపి ముందుగా సుమారు 400 మీటర్ల మేర పక్కా డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేశారు. డ్రెయిన్ నిర్మాణంతో కాలనీలోని వీధి రోడ్లన్నీ మునిగిపోతున్నాయని పీవీఎల్ దృష్టికి తీసుకువచ్చారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంను ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న సమయంలో వీధి రోడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించిన పీవీఎల్ పక్కా రహదారుల నిర్మాణానికి తక్షణం చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతికి సూచించారు. దీంతో శాంతి నగర్ వీధి రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి పరచారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శాంతి నగర్‌లోని వీధుల్లోనూ, ప్రధాన రోడ్డులో ఒక్క చుక్క నీరు కూడా నిలబడలేదు. ప్రజల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. లోతట్టు ప్రాంతమైనప్పటికీ నేడు శాంతినగర్ అభివృద్ధి చెందిన ఏరియాగా కన్పిస్తుంది. శాంతినగర్‌లో ఉన్న ముంపు సమస్యను పరిష్కరించిన పీవీఎల్.నర్సింహరాజును, చైర్మన్ జామి హైమావతి, కౌన్సిలర్ దొడ్డి జగదీష్‌లకు ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఉండి మండలం యండగండి శివారు ఖండ్రిక గూడెంలో ఓ మైనర్ బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసారు. అత్తిలి మండలం గుమ్మంపాడుకు చెందిన బాలిక 15 రోజుల క్రితం ఖండ్రిక గూడెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. గత నెల 29న ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి షాపు వద్దకు సరుకులు తెచ్చేందుకు బయటకు వెళ్ళిన బాలిక కనిపించకపోవడంతో బంధువులు, తెలిసిన వారందరి వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించారు. దీంతో యువతి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

పోడూరు: గుమ్మలూరు శివారు చినపేటలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని గుమ్మలూరు శివారు చినపేట ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం పలువురు గ్రామస్తులు పోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి వినతిపత్రం అందజేశారు. లోఓల్టేజీ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనీ, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తరచూ ఫ్యూజ్ కట్ అవుతోందనీ, కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యుత్ ఏఈకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చికిలే రత్నంరాజు, గోగులమండ పెద్దిరాజు, పమ్మి నాగరాజు, వై.చిట్టిబాబు, విప్పర్తి ఏడుకొండలు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



యండగండిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్



పాలకోడేరు గరువు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గ్రామాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి మండలం యండగండిలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.17 లక్షల అంచనాలతో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు సీసీ రోడ్లు నిర్మిస్తామని అనేక ప్రాంతాల్లో కొబ్బరికాయలు కొట్టి చేతులు దులుపుకుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే నిజాయతీగా అన్ని ప్రాంతాలకు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు సుమారు రూ.లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు అందజేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరిన్ని స్థానాలు గెలుచుని తిరిగి నూటికి నూరుశాతం అధికారంలోకి వస్తామని మరింత అభివృద్ధి చేస్తామని పీవీఎల్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసంగి, వేగేశ్న వేణు, గోపాలకృష్ణమూర్తి, శివనారాయణ, మాజీ ఉప సర్పంచ్ రామరాజు, వరహాలరాజు, జంగం మహాలక్ష్మి, బొబ్బనపల్లి నందయ్య, రామావతారం, కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరులో గరువు ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం పీవీఎల్ నర్సింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు స్వయంగా జరుగుతున్నాయని ఇప్పటికే అత్యధిక గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సీసీ రోడ్ల సమస్య తన దృష్టికి వస్తే వెంటనే నిధులు మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టామన్నారు. పాలకోడేరు గ్రామంలో గరువు కొత్తపేట ప్రాంతంలో సుమారు 170 మీటర్ల మేర రూ.12 లక్షలు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం ఇటీవల దమ్ము ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన డ్రైవర్ గుండుబోయిన సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, సర్పంచ్ ఇంగేటి మరియమ్మ, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, ఉప సర్పంచ్ దెందుకూరి వెంకటరాజు, చేకూరి నరేంద్ర రాజు, భూపతి రాజు వంశీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌కు భూమి పూజ

పాలకోడేరు: పాలకోడేరులో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళా మార్టు నిర్వహించేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన మార్టు భవన పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, చేకూరి నరేంద్ర రాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచ్ దెందుకూరి వెంకటరాజు, సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, బొక్కా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణపై సమీక్ష



వార్డు సచివాలయ సిబ్బందితో పలు అంశాలపై సమీక్షిస్తున్న కమిషనర్ శ్యామల

భీమవరం(ప్రకాశం చౌక్): నగర కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామల పలు అంశాలపై వార్డు సచివాలయం ఉద్యోగులతో సమీక్షించారు. భీమవరం పట్టణం సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వార్డు ఇంజినీరింగ్ సెక్రటరీలతో సమీక్షించారు. అన్ని వార్డులకు సంబంధించిన పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. విస్సాకోడేరు లేఅవుట్‌కు సంబంధించి ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి ఇప్పించాలని వార్డు సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంఈ పి.త్రినాథ్ రావు, డీఈ కె. అప్పలరాజు, ఏఈలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి

పట్టణంలోని పారిశుద్ధ్యం మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి రానున్న వారం రోజుల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న క్లాప్ యూజర్ చార్జీల వసూలులో పురోగతి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పీవీ రంగరావు, శానిటరీ అధికారులు, వార్డు శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం తగదు



భీమవరంలో డీఎస్పీ శ్రీనాథ్‌కు వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వ సహాయం అందడంలో సమన్వయ లోపం కారణంగా తీవ్ర జాప్యం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ సభ్యురాలు జి.సత్యసుధామ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 306 ఐపీసీ 3(2) ఎస్సీ, ఎస్టీ పీవోఏ యాక్టుతో నమోదైన కేసుకు ప్రభుత్వ నష్టపరిహారం వస్తుందని పోలీసుశాఖ తెలుపుతుంటే ఈ సెక్షన్‌కు పరిహారం రాదని కలెక్టర్ కార్యాలయంలో చెబుతున్నారని సత్యసుధామ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 70 కేసులు వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

చెత్త నుంచి సంపద సృష్టి



కొత్తపూసలమర్రులో చెత్త డబ్బాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పేరిచర్ల

భీమవరం అర్బన్ : తడి, పొడి చెత్త ద్వారా సంపద సృష్టించవచ్చని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలం కొత్తపూసలమర్రులో గురువారం తడి, పొడి చెత్త డబ్బాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇంట్లో వాడి పడేసిన చెత్తను తడి, పొడి డబ్బాల్లో సేకరించి మాగబెట్టడం ద్వారా సారవంతమైన వర్మీ కంపోస్టు తయారవుతుందన్నారు. ఆ కంపోస్టును మొక్కలకు వేస్తే ఆరోగ్యకరమైన పండ్లు, కాయగూరలు కాస్తాయన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్య వచ్చిన సత్వరమే పరిష్కరిస్తూ వారికి అండగా ఉంటున్నారన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు, సర్పంచ్‌లు జల్లా కొండయ్య, శ్రీరామపురం ఫణిరాజు, ఎంపీటీసీ తిరుమాని తులసీరావు, ఉప సర్పంచ్ బర్రి నాగరాజు, రాము, ఒడుగు నారాయణమూర్తి, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను నిరసిస్తూ శాంతి ర్యాలీ

ఉండి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఉండిలో క్రైస్తవులు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, గోరింతోట, నక్కరాజుగుంట, తల్లమ్మచెరువు లూథరన్ చర్చ్ పేరిష్‌లకు చెందిన వందలాది మంది క్రైస్తవులు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. ఉండి సెంటర్‌లో క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులు బాధాకరమన్నారు. చర్చ్‌లు తగలబెట్టి హత్యలు చేయడం భయంకరమన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేస్తుంటే అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారన్నారు. దేశంలో శాంతికాముకులైన క్రైస్తవులపై ఇలా దాడులు జరుగుతుంటే దేశ ప్రధాని నరేంద్రమోదీ మౌనంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. దేశమంతా ఏకమై నిరసనలు తెలియచేస్తుంటే ప్రధాని ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం సరికాదన్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడుకు వినతిపత్రాన్ని అందించారు.

అమ్మపాలు అమృతం



పెదకాపవరంలో జగనన్న పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతారాణి



వీరవాసరంలో కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: తల్లిపాలు అమృతం కన్నా గొప్పవని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతా రాణి చెప్పారు. మండలంలోని పెదకాపవరం కల్యాణ మండపంలో తల్లిపాల వారోత్సవాలను సీడీపీఓ వి.వాణీ విజయరత్నం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ మొదటి ఆరు నెలలు, ఆపై ఆహారంతో పాటు రెండేళ్ల వరకూ తల్లిపాలను తప్పనిసరిగా బిడ్డకు ఇవ్వాలని సూచించారు. జడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్ని విధిగా నిర్వహించి గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యకరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం మంచిదన్నారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతోమంచివని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు జగనన్న పౌష్టికాహారం అందజేశారు. తొలుత గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఆయా కార్యకమాల్లో సూపర్‌వైజర్ రత్నకుమారి, నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు, కఠారి రామకృష్ణ(రాము), పలువురు మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆకివీడులో మెప్మా ఆధ్వర్యంలో స్థానిక గొల్లవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి గర్భిణులు, బాలింతలకు జగనన్న పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

పోషకాహార కిట్ల పంపిణీ

వీరవాసరం: నాణ్యతతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని సీడీపీఓ టి.లక్ష్మీకాంతం తెలిపారు. మండల కేంద్రమైన వీరవాసరంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆహారపు కిట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చికిలే మంగతాయారు, సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, పి.కనకలక్ష్మి పాల్గొన్నారు

ఆత్మబంధువుల సేవలు అభినందనీయం: డిప్యూటీ సీఎం

తాడేపల్లిగూడెం అర్బన్ : స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కొనియాడారు. ఆత్మబంధులు సేవా సంస్థ సభ్యులు గురువారం మంత్రి కొట్టును కలిసి మెమెంటోను అందచేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



రాయకుదురులో గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహిస్తున్న ఏఈ శ్రీరామచంద్రమూర్తి

వీరవాసరం: ఇళ్ల లబ్ధిదారులంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ కె.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. రాయకుదురు గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. జగనన్న లేఅవుట్‌లో ఉన్న లబ్ధిదారులంతా తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ , గెద్దం భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు



వేగం పుంజుకున్న వరి నాట్ల కోసం ఆకు కట్టను తీసుకువెళ్లుతున్న కూలీలు.

ఆకివీడు: మండలంలో వరినాట్లలో వేగం పుంజుకుంది. 4,900 ఎకరాల్లో వరి సాగు చేపడుతుండగా, ఇంతవరకూ 3100 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారిణి ఎమ్మార్సీ ప్రియాంక గురువారం చెప్పారు. పల్లపు ప్రాంతాల్లో నాట్లు వేస్తుండగా, మెట్ట ప్రాంతంలో వెదజల్లే పద్ధతిలో సాగుకు మడులను సిద్ధం చేస్తున్నారన్నారు. మండలంలో 50 శాతం పైగా రైతులు ఎంటీయూ 1318 వంగడం సాగు చేస్తుండగా, మిగిలిన రైతులు సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 64, ఎంటీయూ 1121 వంగడాల్ని సాగు చేస్తున్నారని వివరించారు. భారీ వర్షాలు, ముంపు నీటితో ప్రస్తుత ఖరీఫ్‌లో నాట్లు వేసేందుకు ఆటంకం కలిగి ఆలస్యమైందని ఏఓ ప్రియాంక చెప్పారు. వర్షాలకు ముందు నాట్లు వేసిన రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పొలంలో నీటిని పూర్తిగా తొలగించి, ఎరువులు వాడాలన్నారు.

వరద బాధితులందరికీ సంపూర్ణ సహాయం

యలమంచిలి: దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువున ఉన్న 212 మత్స్యకార, ఇతర బీసీ వర్గాల కుటుంబాలకు వరద సహాయం సంపూర్ణంగా అందిందని వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్ కూరగాయలు అందజేశారన్నారు.